UNIVERSAL
LIBRARY
OU_204944
UNIVERSAL
LIBRARY

మధురగీతికలు— ౫

# తేనెచినుకులు

Approved by M. T. B. C. 20-11-34. page 546.

*

తెనుఁగుకన్నెల మానంబు ధీరతయును
చిరము వెలయింప కన్యయై ధరణి నవత
రించి, ఆత్మార్పణమ్ము గావించినట్టి
వాసవీదేవి కిది సమర్పణ మొనర్తు.

*

## తొలిపలుకు

'కవికావ్యములు కవిజీవితచరిత్రములే' యను నార్యోక్తి ప్రాయికముగా నీకాలపుకవులయందు వర్తిల్లు చున్నది. మనయాంధ్రదేశమందలి వెనుకటికాలపు కవుల మాట యెట్లున్నను, ఇప్పటికవులు మాత్రము స్వతంత్రులై తమ మనోభీష్టములను మనస్సంకల్పములను మనోవృత్తులను యథావిధిగా చిత్రించుకొనుచు స్వేచ్ఛానుసారులై మెలగు చున్నారు. కావున వారికావ్యములు, దీర్ఘము లైనను హ్రస్వము లైనను, వారిజీవితాశయములను చిత్తవృత్తులను ముఖ్యముగా విశదీకరించుచున్నవి. ఆంగ్లేయవాఙ్మయ సంసర్గమువలన ప్రస్తుతము మనకవులయందు గల్గిన మార్పులలో నిది ముఖ్యతమ మని నాతలంపు. 'మధురకవి' బిరుదాంకితు లగు నాళము కృష్ణారావుగారు ఈపైసిద్ధాంతమున కొక ప్రబల మైన దృష్టాంతము.

నాళము కృష్ణారావుగా రాంధ్రదేశమందలి సుప్రసిద్ధవణిగ్వంశములో బుట్టినవారై చిరకాలము నుండియు రాజమహేంద్రవరనివాసులై కవిత్వముచేతను, సంఘసంస్కరణాభిలాషచేతను, గౌతమీగ్రంథాలయసముత్థాపన

చేతను, ఇంక ననేకము లగు దేశాభ్యుదయకరము లగు నుద్య
మములలోఁ బాల్గొనుచుండుటచేతను ఆంధ్రులకు చిరపరిచి
తులై యున్నారు. వీరు చిన్నతనమునుండియు నాంధ్ర
వాఙ్మయమునం దభిమానము జూపుచు, కవిత్వము వ్రాయుట
యభ్యసించుచు, బ్రాహ్మసమాజమతమందు దీక్ష బూని పని
సేయుచు, కందుకూరి వీరేశలింగముగారికిని చిలకమర్తి లక్ష్మీ
నరసింహముగారికిని కుడిభుజమై యుండినకాలము నాకిప్ప
టికిని జ్ఞప్తియం దున్నది. కృష్ణారావుగారియందు చిన్నతన
ములో గలిగిన యుత్సాహబీజములు నానాటికి మొలకలెత్తి
వ్రేళ్లుబాఱి వృక్షములై యాయనహృదయవీధియం దిప్పటి
కిని అక్షీణప్రాయమున నెలకొనియున్నవి. చిన్ననాట
బుట్టిన సనుద్దేశములను కాలానుగతవిపర్యయములకు లొంగ
నీయక ధైర్యస్థైర్యములతో నిలుపుకొని వార్ధకమందును
యువకునకు సహజ మగు కార్యోత్సాహముతో పరిశుద్ధ
జీవనమున నిలిచియున్న పురుషు డీతడే. ఇట్టివారు లోక
ములో చాల తక్కువసంఖ్యగా నుందురని నాతలంపు.

కాబట్టి వీరు రచించిన 'తేనెచినుకులు' అనెడి చిన్ని
కబ్బంపుఁబొత్తమునకు తొలిపలుకుగా నాయభిప్రాయము
జెప్ప స్వయముగాఁ బూనుకొంటిని. వీరు సాధుశీలురు,
నిరాడంబరజీవులు. వీరు వర్ణించిన 'చిన్నిపువ్వు' వలె
వీరును,

"ఒరుల మెప్పుల నాసింప నొల్ల వెపుడు,
తళుకుబెళుకుల వాంఛింపఁ దలఁప వీవు,
పావనం బగు తావకజీవనంబు
గడియ యైనను ధన్యంబు గాదె పువ్వ!"

యనినట్లు సత్ప్రవర్తకులై, ఆత్మచ్ఛన్నముగ మరుగుపడి యుండుటయే కోరువారు. కావున వీరిజీవితమందు గౌరవమును వీరికవిత్వమం దాదరణమును గలవాడను. వీరు నాకు సుమారు ముప్పదిసంవత్సరముల వెనుకనుండియు పరిచితులు. అందుచే వీరికవిత్వమును గురించి మనోభావములను గురించి చెప్పుట కించుక యర్హత గలిగినవాడ నని యూహించుచున్నాను.

వీరికవిత్వము మృదువై, మధురమై, సరళముగా నుండుసంగతి నవీనాంధ్రకావ్యములను జదువుచుండిన ప్రతి విద్యార్థియు నెఱిఁగిన విషయమే. వీరికవనశైలి లలితపదఘటితమై మధురస్వనమున వీనులకు విందొనరించుచుండును. ఈరీతిని ముఖ్యముగ వీరు మధురకవిబిరుదమును సార్థకపరచుకొనుచున్నారు. మృదుశబ్దములను ఏర్చి కూర్చుటలో వీరికున్న సామర్థ్య మత్యద్భుతము. నే నెఱింగినంతమట్టుకు మఱి యేయాధునికకవియందును ఈశక్తిని ఈయభిలాషను ఇంత యెక్కువగా జూచియుండలేను. కాన వీరిపద్యము లన్నియు జదివినను కఠినపదములు కాని కఠోరశబ్దములు కాని కానరావని నొక్కి వక్కాణింపవచ్చును.

వీరిమనోభావములు కొంతవరకు నిర్ణీతమార్గములనే పోవుచుండును గాని, నేటి కొందరుకవులవలె సర్వతోముఖ విజృంభణమునను, సమధికరసోద్రేకమునను విశృంఖలముగ పొంగి పొరలుచుండవు. అత్యధికరసావేశమున శోకానందముల జల్పితవికారమున నుచ్చరించుట యీయనయందెచ్చటను గానరాదు. శోకపరితప్తమానసికస్థితియందును నుద్రేకము నిరోధించుకొని కలవరము నొందకుండ సమరసభావమున లేఖినిని నడపింప గలశక్తి యీయనయందు ముఖ్యముగఁ జూడగలము. ఇట్టిశక్తి మన ప్రాచీనకవులలో సర్వసామాన్యము. ఆధునికకవియువకులలో మృగ్యము. ఈయనయందలి యీశక్తిని తెలియగోరువారీయన రచించిన 'పాపాయి' యను చిన్నకావ్యమును జదివిన గుర్తించుకొనగలరు. ఆచిన్నకావ్యము నిజముగా నాధునికకావ్యావళిలో చక్కని మేలిపూసవలె విరాజిల్లుచున్నదని నాయభిప్రాయము. దానియందు పుత్రమరణమునకు దుఃఖించుచున్న తండ్రి యొక్క హృదయవ్యథను నైసర్గికమృదులస్వభావము గలకవి యెట్లు సుకుమారముగ జెప్పెనో, మనకు మొదటిసారి గోచరమగుచున్నది. దీనికి సరి 'షెల్లీ' యను నాంగ్లమహాకవి రచించిన "అడోనైస్" అను శోకకావ్యము (Elegy) అని చెప్పదగును. ఇట్లు లాలిత్యమును మార్దవమును సహజకోమలభావములకు సంధానించుచు వ్రాయగల

నేర్పు చిన్నతనమునుండియు నలవరించికొనినట్లు ఈయన గ్రంథములను రచనాకాలక్రమమున జదివినయెడల స్పష్టమగుచున్నది. వీరికి కవిత్వము సహజమైనను, పరిశ్రమ యధికముగా జేయుచుండువారు గాన, భావమందు గాని రసమందు గాని స్ఖాలిత్యములు సామాన్యముగా నుండవు. ఇదియే వీరియందు ముఖ్యముగా నున్న విశేషము. వీరు రచించి ప్రచురించిన పద్యగ్రంథములను చూచినయెడల, మనకు మఱియొకసంగతి విశదమగుచున్నది. అదేదన, ఈయనకు బాలబాలికల చేష్టావినోదములయందు సానుభూతి యెక్కువ. సామాన్యముగ నీయనకావ్యములయందు వృద్ధస్త్రీపురుషులకంటె బాలబాలికలును యువతీయువకులును ఎక్కువగ కథాపాత్రలుగ నుండుటయే కాన్పించుచున్నది. తనమనోవృత్తులయందు సారళ్యసామరస్యములు ముఖ్యచిహ్నములుగా గల యీకవిగ్రామణికి బాల్యచెయిదములే నిసర్గలీలాసౌందర్యమునకు నిదర్శనములుగ తోచుచున్నవేమో! ఈయన 'బాలురకవి' యని చెప్పిన తప్పు గాదు. బాల్యదశయందలి క్రీడావిలాసములను, శోకానందవికారములను, ఆటపాటలను చిత్రించుటలో నీయన కడుంగడు సమర్థుడు.

ఇట్లు చిన్ననాటి మానసికస్వభావములను గుర్తించి యుల్లేఖించుచును గాన, ఈయన సామాన్యముగా వాడుచుం

డెడు గీతీవృత్తము వీరికవిత్వమునకు సముచితముగా నున్నదేమో యని నాయభిప్రాయము. ఏలాకో కాని యీయన సామాన్యముగ గీతీవృత్తమునే వాడుచుండును. ఈవృత్తము వీరరసభావలహరికి నిరాతంకగతి గలుగజేయుటయే గాక, నాతిచ్ఛందోనియమబద్ధ మగుట, వీరికి కొంత స్వతంత్ర విహారమును గూడ గలుగజేయుచున్నది. కావున వీరిపద్యము లతిధారాళముగ ప్రవహించుచు వేణునాదమువలె శ్రవణపేయముగ నున్నవి.

ప్రస్తుతవిషయ మగు నీచిన్నిపొత్తమున ననేకఖండకావ్యము లున్నవి. ఇవి యన్నియు పైన జెప్పిన నాయభిప్రాయములకు సరియైన నిదర్శనములే. దీనియం దున్న పదునాఱు కావ్యకములలోను సుమారు పదికావ్యకములు బాల బాలికల గుఱించియే. 'పసిపాప' 'ఎట్లు వచ్చితి' 'ఏల యేడ్చుచుంటివి' 'ఏల నవ్వుచుంటివి' 'కేసబియాంకా' 'బాలవీరుఁడు' 'సత్యకాముఁడు' 'ఏడుగురము'— ఇవి యన్నియు బాలురయొక్కయు బాలికలయొక్కయు సహజచిత్తవృత్తులును, ఉన్నతాశయముల గుఱించియు రచింపబడినవే. ప్రతిదానియందును నేదో యొక బాల్యవిశేషము మృదులముగను మనోహరముగను చిత్రింపబడినది. 'కేసబియాంకా' 'బాలవీరుడు' అను రెంటియందును నిర్భీతచిత్తులై శూరాగ్రేసరులైన యిద్దరు బాలురగురించి వ్రాయ

బడినది. 'సత్యకాముడు' అనుదానియందు నిత్యసత్యభాషి యగు బాలుడై వేదకాలమునాటి గౌతముని శిష్యుడైన సత్యకామ జాబాలియొక్క ప్రశంస యున్నది. ఇంక ,,పసిపాప, ,ఎట్లు వచ్చితి, ,,ఏల యేడ్చుచుంటివి'' ,,ఏల నవ్వుచుంటివి'' ,ఏడుగురము' వీనియందు బాలబాలికల యమాయికపుటూహలు, నిర్మలానంద క్రీడలు, నిర్నిమిత్త చిత్తవికారములును వారివారిసహజప్రకృతికి సరిపోవునట్లు రచింపబడినవి. 'మనశ్శాంతి' యందు స్వకాయకష్టముచే జీవనము చేయుచుండుటవలన శరీరమునకును మనస్సునకును ఎంతసౌఖ్యము, ఎంతయానందము, ఎంతశాంతియు కలుగు మండునో చక్కగా చిత్రింపబడినది. 'శివాజీశీలము' 'అక్బరునిర్వేదము', 'సామాన్యయోధుడు' 'బ్రూసు, సాలీడు' వీనియందు దేశాభిమానము శౌర్యపరాక్రమములును ఆదర్శప్రాయముగ నభివర్ణింపబడినవి. ఇట్లు ప్రతి కావ్యకమునందు నేదో యొక పవిత్రవిషయమో, మనోజ్ఞ విషయమో లలితరీతిని ప్రదర్శింపబడినవి. వీనిలో కొన్ని మనదేశసంబంధమైనవి గాన, కవిచే నూతనముగా రచింప బడినవి. మరికొన్ని ప్రసిద్ధాంగ్లకవులచే వ్రాయబడి యీకవి వరునిచే అనువదింపబడినవి. ,,కేసబియాంకా'' ,,బ్రూసు, సాలీడు''— మున్నగునవి భాషాంతరీకరణము లని ప్రతి యాంగ్లభాషావిద్యార్థియు నెఱిగియున్నదే.

కావున ఇట్టిపరిశుద్ధమైన విషయములు గలిగి సులభశైలిని వ్రాయబడి బాలురయందు కార్యోత్సాహాభిలాషలను పురికొల్పగల యీఖండకావ్యములు మనయాంధ్ర బాలబాలికలు చిన్నతనముననే చదువగల యవకాశము గలిగిన యెడల ఎంత బాగుగ నుండును!

మనపాఠశాలలలో ప్రస్తుతము వాడుచున్న పఠన గ్రంథములయందలి పద్యభాగమున పురాణములనుండియో శతకములనుండియో నీతి క్కి సంబంధములైన భాగములను తీసి చేర్చుట యాచారము. వానికంటె ఈచిన్ని పుస్తకమునందున్న ఖండకావ్యములు స్వాభావికములై మనోరంజకములై యాదర్శప్రేరకములై యుండుటచే, దేశాభిమానమును సాహసము మహోదారాశయములను పెంపొందించుకొనవలసిన మనభావిపౌరులగు బాలవిద్యార్థులు జదివిన, వారికెంతయో మేలు కలుగు నని నేను దృఢముగా నమ్ముచున్నాను.

| | |
|---|---|
| రాజమహేంద్రవరము | టేకుమళ్ల అచ్యుతరావు |
| ౨౮-౧౦-౩౮ | ఎమ్. ఎ., ఎల్. టి. |

## చిన్ని పువ్వు

ఏల పూచితి వో చిన్ని నీలిపువ్వ!
ప్రజలు నడయాడు పచ్చికబయలినడుమ?
మనుజు లెం[illegible]న నీదారి మసలి రేని
వారియడుగులఁ బడి నల్గి వాడిపోవె?

శిరము నేటికి వంచెదే చిన్నిపువ్వ!
పరుల దృష్టిపథంబునఁ బడకయుండ?
ఇంచు కొకసారి నెమ్మోము నెత్తి తేని
జనులు తమకన్నుఁగవ నద్దుకొనరె నిన్ను?

నీకు పే రేమి లేకున్న నీలిపువ్వ!
సౌకుమార్యమునందును, సౌరభమున,
సోయగంబున నీసాటి సుమములందు
కొంచె మేనియుఁ గలిగెనే కొఱఁత నీకు?

వన్నెచిన్నెలు గల పువ్వు లెన్ని యున్న
నిన్నె ప్రేమింతు మనసార చిన్నిపువ్వ !
నీ నిరాడంబర వివిక్త నిష్కళంక
జీవనంబును నలవడఁ జేసికొనఁగ.

ఒరులమెప్పుల నాసింప నొల్ల వెపుడు,
తళుకుబెళుకుల వాంఛింపఁ దలఁప వీవు ;
పావనం బగు తావకజీవనంబు
గడియ యైనను ధన్యంబు గాదె పువ్వ !

## పసిపాప

ప్రియము గూర్తురు, కూర్ప రప్రియము నెపుడు,
మోదమే కాని ఖేదంబుఁ బొరయనీరు;
పెద్దవారలకంటెను పిన్నవారె
కొల్లగొందురు పితరులయుల్లములను.

తల్లిదండ్రులు కినుకచేఁ దన్ను గొట్టఁ
దనశిరంబును వారియక్కునఁ గదించి
జాలి పుట్టఁగ నేడ్చెడు బాలుఁ జూడ
ఉల్ల మెవ్వరి కైన రంజిల్ల కున్నె?

ఇంతలో నవ్వు, నేడుచు నంతలోనె,
ఇంతలో వేఁడు, బెదరించు నంతలోనె,
ఇంతలో నల్గు, మనసిచ్చు నంతలోనె;
చిత్రములు గావె పసిపాపచేష్ట లౌర!

వింతవస్తువో తాయమో చెంత నిడిన
యంత, కనకాభిషేకంబు నందినట్లు
పొంగి గంతులు వైచుచు నింగి ముట్టు;
అల్పసంతోషి కాఁ డఁటే యర్భకుండు?

పువ్వుఁ దేనెయు తావియు పుప్పొడియును
చిందకున్నను చెడకున్న చెదరకున్న
ముద్దుబిడ్డలనవ్వుతోఁ బోల్పవచ్చు
క్రొత్తఁగా విచ్చు పున్నాగగుచ్ఛకంబు.

కన్నె వెన్నెలకన్నను, వెన్నకన్న,
మంచుబిందులకన్న, కొమ్మించుకన్న,
కుసుమమకరందమునకన్న కోమలంబు,
చిఱుతపాపల చిన్నారి చిన్నినగవు.

నల్లనివి యొల్ల నీళ్లును, తెల్ల వెల్ల
పాల టంచును సూటిగాఁ బలుకుచుండు,
కల్లకపటంబు లెఱుఁగఁడు పిల్లవాఁడు;
బిడ్డఁ డన దేవుఁ డన వేఱె భేద మున్నె?

ఆడు, నేడుచు, పలవించు, పాడు, సోలు,
తేటిపాఱఁగఁ దిలకించు, కేరు, నవ్వు,
గొణుఁగుఁ దనలోన, వేదురు గొన్న భంగి
నుండు; పసిపాప కేవలయోగి కాఁడె!

తీవి బొటవ్రేల పిల్లనగ్రోవి గాఁగ
మోవిఁ గీలించి యెల్లరు మోహజలధి
నోలలాడఁగ కలరవ మాలపించు
ముద్దుబిడ్డఁడు గోపాలమూర్తి కాఁడె?

తనదు నవ్యక్తమధురగీతంబులకును
కాలుసేతులయల్లార్చు తాళములుగ,
వెలికిలఁ బరుండి క్రీడించుబిడ్డఁ డెన్న
లోకకల్యాణమునకు మాఱాకు గాఁడె!

వెండిపళ్లెరమునయందు వెలుఁగుచున్న
కప్పురపుదీపమో యన నొప్పుమీఱు
జిలుఁగు వెల్లని దుప్పటిసెజ్జమీఁద
తీవిఁ గూర్చుండి క్రీడించు డింభకుండు.

## ఎట్లు వచ్చితి?

"ఎట్లు వచ్చితి? నన్ను నీ వెచటినుండి
తెచ్చికొంటివి! అమ్మరో? తెలుపు" మనుచు
పలుకుపలుకున తేనియ లొలుకుచుండ
అడిగె నొకనాఁడు తనతల్లి ననుఁగుబిడ్డ.

కనుల నానందబాష్పముల్ తొనఁకియాడ
చిన్నిబాలుని నక్కునఁ జేర్చి తల్లి
మోవి మోవిని గదియించి ముద్దు గొనుచు
ఇట్లు వచియించె మక్కువ యుట్టిపడఁగ.

"నాదువలపుల మొలకవై, నాతలంపు
పంటవై, నాతపంబుల ఫలమ వగుచు
దాఁగియుంటివి నాదు డెందంబునందు
ఇన్నినాళ్లును నాముద్దుచిన్నికూన!

చిన్నతనమున కూర్మినెచ్చెలులఁ గూడి
మంటిముద్దల చిన్నిబొమ్మలను జేసి
వేడుకలు మీఱ నే నాట లాడునపుడు
బొమ్మలను దాఁగి యుంటివి ముద్దుబిడ్డ!

అనుపమం బగు భక్తి నే ననుదినంబు
ఎలమి గృహదేవతల పూజ సలుపువేళ,
దేవతలలోఁ నీవు మూర్తిభవించి
నిలిచియుంటివి నాదుమందిరమునందు.

యౌవనం బను తొలకరి యంకురించి
మవ్వ మగు నామనం బను పువ్వుగుత్తి
విరిసి యల్లన ఱేకులు విచ్చునపుడు,
అంటియుంటివి తావివై యందు బిడ్డ!

నాదు జీవితమునయందు, నీదుకూర్మి
తండ్రిజీవితమున, వానితల్లిదండ్రి
జీవితంబుల, వేయేల— సృష్టి మొదలు
నిలిచియుంటివి యీయింట నేఁటిదనుక.

ఆ యనంత తేజో రాశి నవతరించి
విశ్వజీవనవాహినీవీచిఁ దేలి
నాదు మానససింహాసనమున నేఁడు
కట్టికొంటివి పట్టంబు తుట్టతుదకు.

భువనమోహన మైన నీమూర్తి నేను
కనులపండువుగాఁ జూడఁగాంచునపుడు,
నిలువునను నాదుమే నెల్ల పులకరింప
అట్టె వ్రాన్పడి నిలుతు నీయెట్టయెదుట.

ముద్దులొలికెడు నీదునెమ్మోముదమ్మి
కాంతిఁ దీఱ నెగాదిగఁ గాంచునెడల
దృష్టితాఁకెడినో యంచు దిగులు జెంది
తేఱిపాఱఁగఁ దిలకింప నేర నెపుడు.

ఎన్నడైనను నను నీవు కన్నుమొఱఁగి
జాఱిఁగిపోదువో గికురించి యనెడు భీతి
మంజులం బగు నా బాహుపంజరమున
పట్టి బంధించియుంతు నోచిట్టిపట్టి! *

## ఏల యేడ్చుచునుంటివి ?

చిన్నికన్గవముత్తెంపుచిప్పలందు
జాతి కన్నీటిముత్తెముల్ జాలువాఱ,
ఏల యేడ్చుచునుంటి వో బాలపాప ?
చెనకి నిను గొట్ట నెవనికి చేతులాడె ?

చిట్టిచేతుల సారె కట్టెట్టు త్రిప్పి
నేలపై నీవు పొరలాడ, ధూళి యంటి
మురువు గులికెడు నీమోము మురికివాఱె
ననుచు కొట్టిరె యెవ రైన ననుఁగుబిడ్డ ?

చలువవెన్నెల లెల్లెడ చిలుకరించి
ఎల్లజీవులఁ గడు నుల్లసిల్లఁ జేయు
చందురునియందు నొక్కింత కందు గలుగ,
తక్కు వయ్యెనె యాతనిచక్కఁదనము ?

గల్లు గల్లున చిఱుగజ్జె లల్లలాడ
అల్లనల్లన మెల్లఁగ నడుగు లిడుచు
చింకిచొక్కాయితో నీవు చిందులాడ,
కొట్టిరే నిన్ను నెవ రైన చిట్టిబిడ్డ ?

విన్నువీథిని జాబిల్లి వెడలువేళ
చివికి శిథిలమై యెడనెడ చెదరియున్న
వన్నతొలకరిమబ్బులు తన్ను గప్ప
కొఱఁతవడియెనె యాతనికొమరుఁదనము ?

## ఏల నవ్వుచునుంటివి ?

లీల నొక కేల విఱిగినకోలఁ బట్టి
హొయలు మీఱఁగ పచ్చికబయలుమీఁద
ఓహో! ఎంత హాయిగ నాడుచుంటి! వోయి ?
ముచ్చటగుఁ గాదె నిను జూడ ముద్దుబిడ్డ!

సంతసంబున త్రుళ్లుచు, గంతు లిడుచు,
పరుగు లెత్తుచు పాడుచు, కెరలి కెరలి
ఏల నవ్వుచునుంటి వోబాలపాప?
కనులపండువ యగుఁ గాదె నిను గనంగ.

చేతి కందినవస్తువుల్ ప్రీతిఁ గొనుచు
వేడుకలు మీఱ నీ వాటలాడుచుండ,
అందఁజాలని వస్తువు లాసఁ జేసి
వెచ్చ నూర్చుచు నే ప్రొద్దు పుచ్చుచుందు.

చలువవెన్నెలగుత్తితో, సంజతోడ
హాయి మీఱంగ నీ వాటలాడుచుండ,
వెండిబంగరురూకలపిండు చేర్చి
తనివి నొందని యాసలం దవిలియుందు.

అందరాని ఫలంబుల కఱ్ఱు సాఁచి
పొందనేరని పదవులం బొందఁ గోరి
చేయరానట్టి పను లెన్నొ చేసి చేసి
గడపుచుందును రిత్తగాఁ గాల మెల్ల.

ఆశ లనియెడు సాగరమందు నీఁది
మునిఁగి తేలుచు, తేలుచు మునిఁగి నేను
జడుఁడనై జీవయాత్రను గడపుచుండ,
నవ్వుచుంటివి కాఁబోలు నన్నుఁ జూచి.

## కే స బి యాం క

భగ్గు మని మండు నోడపై భాగమందు
నిట్టనిలుచుండె బాలుండు నిబ్బరముగ,
తనదు జనకునియానతి తలను దాల్చి;
పఱచి రెల్లరు నాతఁ డొక్కరుఁడు దక్క.

సంజకెంజాయనడుమ భాస్కరుఁడు వోలె,
దట్టముగ మండు మంటలనట్టనడుమ
విమల కాంతుల బాలుండు వెలుఁగుచుండె,
వీరరస మౌర! మూర్తిభవించె ననఁగ.

ఉజ్జ్వలంబుగ జ్వాలలు ప్రజ్వరిల్లె
కాని, యాబాలుఁ డొక్కంత కదలఁ డయ్యె
తండ్రియానతి భక్తిమై తలను దాల్చి;
బళిర! ఎంతటి ధీరుండొ బాలకుండు?

'చెప్పుమా తండ్రి! నే నింక నిప్పు డైన
అవలి కేగుదునే' యంచు నఱచె నతఁడు,
ఎఱుఁగ డక్కట! తనతండ్రి యింతమున్నె
అగ్నిహోత్రుని కాహుతి యయ్యె నంచు.

భీకర కరాళ సర్పజిహ్వాకల భాతి
బుస్సు బు స్సని చిచ్చులు బుగులుకొనియె;
విలయకాలము శాసించు విభునిఁ బోలె
నిర్భయంబుగ నిలుచుండె నర్భకుండు.

వేడ్కమై మృత్యుదేవిని పెండ్లియాడ
తమక మొందెడు పెండిలికొమరుఁ డనఁగ,
తీవి మీఱఁగ నిలుచుండె డింభకుండు
వీర శృంగారరసములు పెనఁగులాడ.

'ఏల పలుకవు? నాపని యిప్పు డైన
అయ్యెనే? యని క్రమ్మఱ నఱచె నతఁడు;
వానిపలుకులు చిటపెటార్భటులనడుమ
నడఁగి యవలికి వెలువడ వయ్యె నకట!

పాదముల సోఁకి, యూరులపైకిఁ బ్రాఁకి,
కౌనునఁ బెనంగి కంఠంబు కౌఁగిలించి,
చిట్టిచుబుకంబు చుంబించె; ఎట్టితిపా
వీతిహోత్రుని కాముద్దుబిడ్డమీఁద?

జ్వలన మొందెడు వహ్నికాజ్వాలలవయి
అతని జీరాడు కురులు నాట్యంబు సలిపె,
విరియఁబూచిన మందారతరువుమీఁద
బాళిమై మూఁగు తుమ్మెదపాళి యనఁగ.

మరల గొంతెత్తి కడసారి యఱచె నతఁడు
'నిలుతునే యింక? నీయాజ్ఞ తెలుపు మయ్య'
జాలి గుల్కెడి యాపల్కు లాలకించి
కొందలము జెంది జలనిధి ఘోషవెట్టె.

అంతకంతకు పెనుమంట లగ్గలించి
గుప్పుగుప్పున కుప్పించి యుప్పరమున
కెగసి, యట్టిట్టు గాలిలో నెగురుచున్న
ధ్వజముమీఁదికి దండెత్తి దాడి సలిపె.

అక్కటా! ఏమి చెప్పుదు?— నంతలోనె
బెడిద మగు భీషణధ్వని పిడుగు వోలె
ఉదధిమధ్యమునందుండి యుద్భవించి
బోరుకలఁగెను దిక్కులు మాఱుమ్రోఁగ.

బళ్లు మని యంత నానావ బ్రద్ద లగుచు
చాపకొయ్యయు, చుక్కాని, చాపతోడ
చిదురచిదురలై జలధివీచికలఁ దేలె
అక్కటా! ఎందు నున్నాఁడో యనుఁగుబిడ్డ?

కడలికడుపున నడఁగెనో? గాలిలోన
లీనమయ్యెనో? బాలుండు కానరాఁడు;
మిణుఁగుఁరులఁ బోలె ధగధగ మింట మెఱయు
అగ్నికణముల నడుగుఁడీ యతనిజాడ.

దారుణం బగు నానాఁడు తరణియందు
మ్రంది రెందరో మనుజులు మంట మ్రగ్గి;
నిలిచెనే వారినామముల్ నేఁటిదనుక
ధీరుఁ డగు బాలుఁ డీతనిపేరు దక్క?

## బాలవీరుఁడు

చిట్టిచీమయు చొరరాని దట్టమైన
నట్టడవి, నొక్కదినమున, నడికిరేయి,
నొంటిమై నేగుచుండెను యోధుఁ డొకఁడు
పదియు నెనిమిది యేఁడుల పడుచువాఁడు.

భీకరం బగు నాఘోరవిపినసీమ
నిండువెన్నెలతీఁగలు నిగుడ వయ్యె
చుక్కగుంపుల మినమినల్ చొరఁగరావు
పొటకరించిన కటికిచీఁకటులె కాని.

చిమ్మచీఁకటియే తనచెలిమికాఁడు,
తోర మగు ధైర్యసంపద తోడునీడ,
స్వామిభక్తియె రమ్యభూషణము గాఁగ
ఎటకొ చనుచుండె యోధుఁ డాకటికిరేయి.

అధిపునానతి తలఁ దాల్చి యాతఁ డపుడు
అరులజాడల నరయంగ నరుగుచుండె,
ఎక్క డేచీమ యింత చిటుక్కుమన్న
వేయికన్నులఁ గని పెట్టి వెదకుచుండె.

'మూఁడుజాముల రాతిరి ముగిసె నిపుడు
ఎట్టియలికిడి వినఁబడ దింతదనుక ;
జరిగెనా రాత్రి, సిద్ధంబు జయ' మటంచు
మోద మందుచు నాతఁడు మురియుచుండె.

ముగిసె రాతిరి, కానయు ముగియవచ్చె,
కూఁత వేటునఁ గన్పట్టె కోటబురుజు,
మింట నరుణంపుఛాయలు మిసిమి వెట్టె,
కూసె తొలికోడి కొక్కొరో కో యటంచు.

మించి దినరాజు రేరాజుమీఁది కత్తి
పగతుజాడల నరయంగఁ బంప, వేఁగ
వేఁగుజామున దూతయై వేఁగు నెఱప
నేఁగుదెంచెనో యనఁ దోఁచె వేఁగుచుక్క.

ఆ ప్రశాంత నిశాంతమునందు, వాని
యుల్ల మువ్వీళులూరించు నూహ లెవియో ?
తనదుజనకుని చిఱునవ్వో, అనుఁగుజనని
కౌఁగిలింతయో, ప్రభుని క్రేఁగంటిచూపో ?

గౌతమీపూతసలిలావగాహనంబో?
విమల కృష్ణాసరిత్తీరవిహరణంబో?
కేళికోద్యానవనతటీ క్రీడనంబో?
ఏమి తలపోయుచుండెనో యెవని కెఱుక?

ఉన్నయటు లుండి, అక్కటా! యోధుఁ డట్టె
నిట్టనిలువున మ్రాన్పడి నిలిచె నేమి?
పొదలమాటున నడుగుచప్పుడుల వినెన?
దవుల నెవ్వరో గుసగుసధ్వనుల వినెన ?

అడుగుసడి గాదు, పెనుగాలి యుగ్గలించి
గుమురులై యున్న యాకుజొంపములు వీవ
అటమటించెడు రెమ్మల తటపట లవి;
గుసగుసలు గావు, పాముల బుసబుస లవి.

అదిగో! అది యేమి! ఎవ్వఁడో పొదలనుండి
దొంగ కాఁబోలు— మెల్లఁగా తొంగి చూచి
చెంగు మని యొక్కగంతున చెంగలించి
పెటికె ఖడ్గంబు బాలునికరమునుండి.

ఒక్కరుఁడు కాదు— పదుగురు— పెక్కురగుచు
పుడమి యీనినచందాన పొదలనుండి
ఒక్కరొకరుగ నాతనిచక్కి కుఱికి
చుట్టుముట్టిరి యీఁగలతుట్టెలట్లు.

బాలుఁడా! నీదుకోర్కెలు భగ్నమయ్యె,
నిన్ను జయలక్ష్మి వరియింప నున్నతఱిని
చిక్కువడితివి పగతురచేతఁ దక్కి
చీమగమిచేతఁ జిక్కిన చిలువవోలె.

'మిన్నకుంటివ సరె, నోరు మెదపితేని
నిశితకరవాలధారల నీశిరంబు
చెండు మీటినగతి చించి చెండువార'
మనుచు బాలుని గద్దించి రరులు గదిసి.

విచ్చుకత్తులు చుట్టును వీఁగియాడ
బాలవీరుని వదనబింబంబు వెలసె,
వేయికరములనడుమను వెలుఁగుచున్న
చండమార్తాండబింబంబు చందమునను.

మరణదేవతా వదనగహ్వరమునందు
కొమరు మీఱఁగ బాలుండు కొలువుదీర్చి
'దండు విడిసెను రిపుసేన, లెండు రండు'
అనుచు నెలుఁగెత్తి చీరెను తనబలంబు.

శంఖరవములు, నడుగుల చప్పుడులును,
సింహనాదంబులును వానిచెవులఁ బడియె;
'పొండు, రిపుసేనలను దాఁకి పొడువుఁ' డనెడి
అట్టహాసంబు లోకపెట్టు ముట్టె మిన్ను.

తళుకుకత్తులమెఱపులు తాండవింప
వానినెమ్మేన నెత్తురువాన కురిసె,
భూరిగర్జారవంబున వీరుఁ డఱచె
'దండు విడిసెను రిపుసేన, లెం' డటంచు.

పుష్పితాశోకవృక్షంబు పోలుపు గులుక
చిఱుతఁ డొకచేత సేనలఁ జేయి వీచి,
ఎత్తి యొకచేత శంఖంబు నొత్తి యూఁదె
ప్రాణవాయువు కంఠంబు బాయుదనుక.

* * *

ఉభయదళములు తలఁపడె నొక్కపెట్ట,
తెల్లవాఱెను, రిపుమోము వెల్లఁబాఱె;
గెలుపు గలిగియు ఱేనికిఁ గలుగదయ్యె
నిండుమోదము బాలవీరుండు లేమి.

## సత్యకాముఁడు

క్రుంకె తపనుండు, పక్షులు గూండ్లు సేరె,
ఆలకదుపులఁ జయ్యన తోలికొనుచు
ఆశ్రమమునకు మునిబాలు రరుగుదెంచి
చేరియుండిరి బారులై చెట్టునీడ.

అది మహాముని గౌతమునాశ్రమంబు;
శిష్యులెల్లరు తనచుట్టు చేరి కొలువ,
వీతిహోత్రముపొంత నాగౌతముండు
అలరుచుండెను రెండవయగ్నివోలె.

అంత నొకవింతబాలకుం డరుగుదెంచి
ఫలము పుష్పము లర్పించి, భక్తిమీఱ
మౌనిపదములపైఁ దనమౌళి సోఁక
మ్రొక్కి యీరీతి వచియించె ముద్దులొలుక.

" సత్యకాముఁడు నా పేరు, జబల తల్లి,
బ్రహ్మవిజ్ఞానమును నేర్వ వచ్చినాఁడ;
నీదు పాదరాజీవసన్నిధిని జేర్చి
శిష్యునిఁగ నన్ను ధన్యాత్ముఁ జేయుమయ్య."

స్వచ్ఛమగు బ్రహ్మతేజము వదనమందు
ఉట్టిపడ, నెట్టయెదుటను నిట్టనిలిచి
యున్నబాలుని బొడఁగని యోగివరుఁడు
పలికె నీరీతి కూరిమి మొలకలెత్త.

"ఈశ్వరుఁడు నీకు శుభముల నిచ్చుఁ గాక!
ఏకులము నీది? నీతండ్రి యెవఁడు వత్స?
బ్రహ్మవిజ్ఞానమును నేర్వ బ్రాహ్మణుండు
గాక యన్యుఁడు యోగ్యుండు గాఁడు సుమ్ము"

"తల్లినే కాని నాకూర్తితండ్రి యెవఁడొ
యింతకాలముదనుక నే నెఱుఁగ నయ్య,
అమ్మకడ కేగి కులము గోత్రమ్ము నడిగి
తెలిసికొనివత్తు పంపుమా సెల వొసంగి."

బాలుఁ డీరీతి నొయ్యన బదులు పలికి
మునిని వీడ్కొని, మింటిపై మిసుకు మనుచు
మెరయుచుక్కల గుంపులే తెలుపు సూప
ఏటిదరి నేగి తనతల్లియిల్లు జేరె.

తనయు రాక నిరీక్షించి తమక మొప్ప
తలుపుచెంగట నిలుచున్న తల్లి యతని
గాంచినంతనె బాళిమై కౌఁగిలించి
శిరము మూర్కొని యి ట్లనె పెరిమ గులుక.

“కాంచితివె యోగిసత్తము కాంక్ష దీఱ?
ఆదరించెనె దయతోడ నతఁడు నిన్ను?
యతివరేణ్యుఁడు నీ కేమి యానతిచ్చె?
చెప్పుమా యేమి జరగెనో చిట్టిపట్టి?”

“కాంక్ష కడలాఱ మునివర్యుఁ గాంచినాడ,
అధికదయతోడ న న్నతఁ డాదరించె,
బ్రాహ్మణుఁడు తక్క యన్యుండు బ్రహ్మతత్త్వ
మరయరా దని మౌనీంద్రుఁ డానతిచ్చె.

"అమ్మ! ఎన్నియొసార్లు ని న్నడుగఁ దలఁచి
నుడువఁ దలఁకితి నీమది నొచ్చు ననుచు;
ఎవఁడు నాతండ్రి? ఆతని దేమికులము?
నుడువుమా" యని మెల్లన నడిగె నతఁడు.

సిగ్గుచే నంత నేలకు శిరము వంచి
ఉస్సు రని యామె వేడినిట్టూర్పు పుచ్చి
గద్గదిక తొట్రుపాటును కడలుకొనఁగ
పలికె నీరీతి సన్నని యెలుఁగుతోడ.

"పేదనై జవ్వనంబున పెండ్లి లేక
పెక్కుపతుల సేవించితి స్వేచ్ఛ మీఱ;
పొడమితివి నాఁడు నీవు నాకడుపునందు
ఎట్లు వచియింతు నీతండ్రి యెవఁడొ కుఱ్ఱ!"

సంజకడ లేచి శిష్యులు స్నానమాడి
చదువుచుండిరి గురునొద్ద శాస్త్రములను;
బాలుఁ డంతట చనుదెంచి కేలు మోడ్చి
మౌనిపాదాబ్జములకు నమస్కరించె.

"నీదుకుల మేది! ఎవ్వఁడు నీదుతండ్రి?
నుడువుమా, వత్స!" యని బాలు నడిగె మౌని;
జాలి గులుకంగ వినిపించె బాలుఁ డంత
తల్లి తనతోడ చెప్పిన దెల్ల మునికి.

"సిగ్గు నెగ్గును విడిచి యీచెడిపెకొడుకు
ఎట్టి సాహసమున కొడిగట్టె నౌర!"
అనుచు వడుగులు గుసగుసలాడికొనుచు
చులుకుచూపుల నతనిపైఁ బఱపి రంత.

కనుల నానందబాష్పముల్ తొనకియాడ
దిగ్గు రని లేచి బాలుని బిగ్గఁ బొదివి
కౌఁగిటఁ గదించి మౌని గద్గదిక గదుర
ఇట్లు వచియించె మక్కువ యుట్టిపడఁగ.

"తల్లిగుట్టైన నించుక దాఁచకుండ
సత్యము వచించితివి గాన 'సత్యకాముఁ'
డనెడు నీపేరు సార్థక మయ్యె వత్స!
నిక్కమగు బ్రాహ్మణుండవు నీవ కావె?"

# ఏ డు గు ర ము

ఏమి యెఱుఁగని యొక యమాయికపుబిడ్డ
కన్ను లైనను తెఱువని చిన్నికూన
చెక్కు గీఱిన పాల్గాఱు చిఱుతపాప
ఎఱుఁగునే యది యెట్టిదో మరణ మన్న ?

కంటి నొకబాల మార్గంబువెంటఁ జనుచు;
ఆమె యాఱేండ్ల లేతపాయంపు పూప,
పల్లెలో పుట్టి పెరిగిన పిల్ల యగుట
అన్నెమును పున్నె మెఱుఁగని యట్టి బేల.

నిగనిగలు దేఱి ముంగురుల్ నెఱులు దిరిగి
ఆమెమొగమున దోబూచు లాడుచుండె,
తేటకన్నులు ముద్దులు మూట గట్టె
ఆమెయందము నన్ను మోదాబ్ధిఁ దేల్చె.

‘అమ్మ! నీనామ మెవ?’ రని యడిగియుంటి,
‘సరళ’ యని యామె బదులిడె; ‘సదన మెచట
నన్న?’ దని యంటి, ‘నెదుటనే యున్న’ దనియె
పలుకుపలుకున తేలియ లొలుకుచుండ.

‘చిన్నిబాలరో! నీ కెందఱ రన్నదమ్ము
లక్కచెల్లెండ్రు గల?’ రని యడిగియుంటి,
‘ఎందరో యేల- నాతోడ నేడ్గు’ రంచు
పలికె నను జూచి యబ్బురపాటు నొంది.

‘చిన్నికన్నెరో! వా రెందు నున్నవారు?’
ఇట్టు లనె నామె, ‘మేమంద రేడుగురము,
అన్న లిరువురు పొరుగూర నున్నవారు,
ఇరువురక్కలు పతులిండ్ల కేగినారు.

మఱియు నిరువురు కలరు సమాధులందు
అక్క యొక్కతె, సోదరుఁ డొక్కరుఁడును;
వారిచెంతనె యీపుష్పవనమునందు
ఇంటిలో నేను తల్లితో నుంటి నయ్య.’

"అన్న లిరువురు పొరుగూర నున్నవారు,
ఇరువురక్కలు పతులిండ్ల కేగినారు;
ఇంటిలో నుంటి నే' నని యంటి వమ్మ,
ఏడ్గు రె ట్లైరి? నీమాట లెట్లు పొసఁగు?"

తడవుకొనకుండ నాబాల నడిచె నిట్లు,
'ఏడ్గురము మేము, చెప్పితి నింతమున్న-
అందు నిరువురు గలరు సమాధులందు
తోటయందలి మామిడితోపునడుమ.'

'ఈవు చెప్పినమాటలే యియ్యకొందు,
ఏడుగురు మీర లందఱు, ఇరువు రందు
ఉసురు వాసి సమాధుల నున్నవారు,
ఐదుగురు కాదె మిగిలినయట్టివారు?'

'ఇట్టిమాటల నాడంగ నేటి కయ్య?
ఉసురు వాసియు నెదుటనే యున్నవారు
అల్లదే! యాసమాధులయందుఁ జొచ్చి,
వారిపై మట్టి యిఁక తడియారలేదు.

అనుదినంబును మధ్యాహ్న మచట నేను
కూరుచుండి రుమాళ్లను కుట్టుచుందు;
జననితోఁ గూడి పలుమఱు సంజవేళ
ప్రార్థనాగీతముల నట పాడుచుందు.

రమ్య మగు పండువెన్నెలరాత్రులందు
చలువఱాతిన్నెపైఁ జేరి, చల్లగాలి
వీచుచుండఁగ, భక్ష్యముల్ వేడ్క మీఱ
నారగింతుము నేను మాయమ్మ యచట.

'నిర్మల' గతించి నెల యైన నిండలేదు,
చనియె 'విమలుండు' మొన్ననె స్వర్గమునకు;
తోటలో నవె యీసమాధులును రెండు
వరుస నున్నవి యొకదానిప్రక్క నొకటి.'

'బాలరో! వార లిరువురు స్వర్గమందు
నున్నచో, నింక మీ రెంద రున్నవారు?'
అనుచు నడిగితి, తోడనే యామె నుడివె,
'ఇంత యేటికి- మే మంద ఱేడుగురము.'

'వార లిరువురు మృతినొంది స్వర్గమునకు
నేగినా ' రని నొక్కి నే నెంతసేపు
నుడివినను గాని, తనపట్టు విడువ కామె
పాడుచుండెను ' మేమంద తేడుగురము.'

## బిచ్చకత్తె.

జీర్ణమై కడు మాసిన చీర గట్టి
విరియఁబాఱిన నిడువాలుకురులు వ్రేల
కేలుదోయి నురమ్మునఁ గీలుకొలిపి,
వచ్చె భూవరుకడ కొక్కబిచ్చకత్తె.

అతివ నల్లంతదవ్వున నట్టె చూచి
వెఱఁగుపాటును నివ్వెఱ పెనఁగొనంగ
దిగ్గు రని లేచి గద్దియ డిగ్గి ఱేఁడు
ఎదురుగా నేగి స్వాగతం బిచ్చె నెలమి.

కటికిచీఁకటిమొత్తము కడకుఁ దోలు
కలికిమైజిగి మిఱుమిట్లు కొలుపఁ, జూచి
'అద్దిరా! యామెసోయగ! మౌర! హాయులు!'
అనుచు తలలూచి మెచ్చిరి యచటిప్రజలు.

ముఱికివాఱిన యామేలిముసుఁగునందు
కాంతనెమ్మోముచెలువమ్ము కానిపించె,
చిఱుతమబ్బులమాటునఁ దుఱఁగలించు
నిండునెలవోలె కన్నులపండు వగుచు.

'వాలుఁగన్నుల జగ మెల్ల నేలఁ జాలు
తరుణిమిన్నకు నే మిచ్చి తనుపువాఁడ?
బాళి మీఱఁగ నన్నె యప్పనము చేసి
ధన్యుఁడ నగుదుఁ గా' కని తలఁచె రాజు.

## సామాన్యయోధుఁడు

ఒకదినంబున సాయంత్ర మోరుగల్లు
నగరవీథుల నొకవ్యక్తి నడచుచుండె;
అతనిదుస్తులు సామాన్య మైన వగుట
ఆతఁ డెవ్వరో యెఱుఁగ లే రైరి జనులు.

దారుణంబును కడు విషాదంబు నైన
దృశ్య మొక్కటి యాతనిదృష్టిఁ బడియె,
శకటశకలంబుపై నొక్క శవము బెట్టి
లావుమై నొక్క మనుజుండు లాగుచుండె.

బండిపై కప్పు, శవముపై బట్ట లేదు,
అతనివెనువెంట నొకఁడు సాయంబు లేఁడు,
బరువుచే క్రుంగి యాయాసపడుచు నతఁడు
లాగఁజాలక సారెకు నాగుచుండె.

దానిఁ గనినంత పథికుండు తల్లడంబు
నొంది యి ట్లనె, 'అన్న ! నే నొక్కమాట
యడుగుచుంటిని, దయచేసి నుడువు మయ్య,
శకటమున నీవు గొనిపోవు శవ మెవరిది ?'

'యుద్ధమునఁ బోరి మరణంబు నొందినట్టి
యొక్క నిఱుపేదసామాన్యయోధుఁ డితఁడు'
అనుచు నాతఁడు మాఱు మాటాడకుండ
తిరిగి చూడక తనదారి నరుగుచుండె.

"ఏమి యంటివి ? ఆంధ్రుఁడా ! ఏమి యంటి ?
'వొక్క నిఱుపేదసామాన్యయోధుఁ' డనియ ?
పేద యగుఁ గాక, రణమున వీరమరణ
మందు యోధుఁడు సామాన్యుఁ డగునె తలఁప !

ఆగు మాగుమ ఆర్యుఁడా ! ఆత్ర మేల ?
అక్కటా ! యిట్టివీరుండు దిక్కు లేని
యనదకై వడి కాటికి నరుగ నేల ?
అన్న ! నీవెంట రానిమ్ము నన్ను గూడ."

అనుచు వచియించి తోడనే యతఁడు తనదు
నుత్తరీయంబులో దాఁచి యుంచికొనిన
మణిమయం బగు మకుటంబు మౌళిఁ దాల్చి
వెనుకఁ జనుచుండె నాతండు గనకయుండ.

దారి వెంబడిఁ జనుచు, ప్రతాపరుద్ర
చక్రవర్తిని గాంచి యాశ్చర్య మొంది,
ప్రజలు మంత్రులు ప్రభువులు భటులు కావు
లరిగి రాబాలగోపాల మధిపువెంట.

రాజరాజుల కైన దుర్లభ్య మైన
వైభవంబున, ధారుణీవల్లభుండు
ఊరుపేరును లేని యా యోధవరుని
యంత్యవిధుల యథావిధి నాచరించె.

## మనశ్శాంతి

పావనం బగు గౌతమీపరిసరమున
అల్లిబిల్లిగ పూఁదీఁగ లల్లుకొనిన
రమ్యతలమున నొకకుటీరంబునందు
కాపురం బుండె నొక పేదకాఁపువాఁడు.

కలఁత యెఱుఁగని వానికన్గొలుకులందు
అనిశ మానందలక్ష్మి తా నధివసించు,
వలుద యగు వానివక్షఃకవాటమందు
నిలిచి ఆరోగ్యదేవత నృత్యమాడు.

ఆతఁ డొకనాఁడు తనయింటియరుగుమీఁద
పిల్లవాయువు మెలమెల్ల వీచుచుండ,
కొమరులును దాను భార్యయు కూరుచుండి
వేడు కలరఁగ నీరీతి పాడుచుండె.

"పరులపదవుల కెవ్వఁడు వాంఛ సేయ
పరులు నాదగుపదవికి వాంఛ గొనరు,
ఉన్న దానికి సంతుష్టి నొందువాఁడ
లేనిదానికి లేశంబు క్లేశ మొంద."

వేఁట ముగియించి ఆదారివెంట మరలి
తనదుపరివారజనులతోఁ జనుచు రాజు,
అతనిపాటల నాలించి యట్టె నిలిచి
హాయముపై నుండి వానితో ననియె నిట్లు.

"బాపురే! ఏమి యంటివి కాఁపువాఁడ?
నీదువాక్యము నిక్కంబు గాదు సుమ్ము
ఈజగం బెల్ల పాలించు రాజ నేను
నాకు లేని మనశ్శాంతి నీకుఁ గలదె?

జంకు గొంకును లేక నిశ్శంకముగను
శ్రావ్య మగు నీదు మంజులస్వరముతోడ
హాయిగా పాట పాడెదు హాళికుండ!
చెపుమ యెటు కల్గె నీ కిట్టిచిత్తశాంతి?"

అనుడు నవ్వుచు జేనితో ననియె కాఁపు:
“చెమట యూడ్చి దినం బెల్ల చేను దున్ని
కూడుగుడ్డకు నేమియు కొఱఁత లేక
జీవయాత్రను సాగింతు స్వేచ్ఛ మీఱ.

సతియు బిడ్డలు నాకనుసన్న మెలఁగి
పనులు గావింతు, రెన్నడు బదులు గొనను
పరులకడ పైస మైన, నెల్లరును నాకు
మిత్రులే కాని లేఁ డొక్క శత్రు వైన.

కమ్మ తెమ్మరబుడుత నాకమ్మ తీఁడు
గౌతమీనది నాయూడిగంపుటింతి
పగలు రేయియుఁ బాయక ప్రకృతికాంత
నాకు పరిచర్య చేయుచు సాఁకుచుండు.”

ఉన్న రని రాజు పెద్దనిట్టూర్పు పుచ్చి
పలికె నీరీతి నాకృషీవలునితోడ,
“నిజము నీమాట లెల్లను నిక్కువములు
వెయ్యియేఁడులు వర్ధిల్లు మయ్య నీవు.

విశ్వ మెల్లను పాలించు విభుఁడ వయ్యు
స్వాంతమున నాకు సుంతయు శాంతి లేదు,
అందఱును నాకు శత్రులే యగుటఁ జేసి
కుదురుగా నొక్కరేయియు నిదుర వోవ.

ఎలమి నీ విప్పు డాడిన పలుకులందు
అన్ని ముమ్మాటికి నిజంబె యగును గాని,
'పరులు నాదగుపదవికి వాంఛ సేయ'
రనెడు వాక్య మొక్కటియె సత్యంబు గాదు.

కూర్మిమిత్రుఁడ! నీ వియ్యకొంటి వేని
రక్తిమై నాదు రాజ్యసర్వస్వ మెల్ల
నీకు నప్పన మొనరించి, నీదుపదవి
హృదయపూర్వకముగ స్వీకరించువాఁడ.

రత్నమయ మగు నాదుతురాయి కంటె
బాగు మీఱిన నీకుచ్చుపాగ మేలు;
నాదు బంగరుసింహాసనమ్ము కంటె
అలికి ముగ్గుల నిడిన యీయరుఁగె మేలు.

నిత్యసంతోషభరితుఁ డౌ నిన్ను బోలు
ఉత్తమోత్తముఁ డొక్కరుఁ డున్నఁ జాలు,
నాదసామ్రాజ్య మొకటియే కాదు— తనదు
విమలకాంతుల వెలయించు విశ్వ మెల్ల."

## అక్బరు నిర్వేదము

ఆమె యెవ్వరు? కేలఁ జంద్రాయుధంబు
రాణ మెఱయఁగ పంచకల్యాణి నెక్కి
సమరభూమి విహారంబు సలుపుచుండె
వీరరస మెల్ల మూర్తీభవించె ననఁగ.

నెన్నుదుటఁ దూలి ముంగురుల్ నృత్యమాడ
చెక్కుదోయిని గ్రమ్మిన చెమ్మటలను
మాటిమాటికి కొనగోట మీటికొనుచు
దెసలఁ బరికించుచున్న యా తెఱవ యెవరు?

ఆహవంబున రిపులపై మోహరించి
ఓహాటిల్లక పోరాడి, యుర్వి నొరఁగి
యున్న తనసేనఁ దిలకించి యుస్సు రనుచు
వేడినిట్టూర్పు బుచ్చె నాచేడె యెవరు?

కట్ట! ఏ మిది? ఎంతలో నెట్టి మార్పు?
లలితశృంగారమున కవలంబ మైన
వనిత భీభత్సమున కాలవాల మగుచు
భీకరాకృతి ధరియించి భీతి గొలిపె.

కరుణ కిర వైన యూవాలుఁగన్నుఁ దోయి
గ్రక్కుచున్నది విస్ఫులింగముల నిపుడు;
మొలకనవ్వుల నొలికించు ముద్దుమొగము
కురియుచున్నది దారుణ క్రోధరసము.

అరరె! యూమె జరీలున హాయము డిగ్గి
చికురములు విచ్చి పాయలై చిందులాడ,
వాలు ఝుళిపించి నిష్ఠురస్వరముతోడ
నన్నె కాఁబోలు పిలుచుచునున్న దదిగో.

ఏమి యనుచుంటి? వీవు పాలేశ్వరివియ?
'రాజ్ఞులము మేము మేవాడురాజ్యరమకు,
ఉసురు లీదేహమున నిల్చియుండుదాఁక
పాటిగొందుమె నీసార్వభౌమపదవి?'

అనియ నీ వనుచుంటివి ?- అమ్మ ! నిజము
దేవి ! నీచిత్తవృత్తిని తెలిసికొంటి,
మేటి మేవాడురాజ్యంబు మీదె సుమ్మి
నొక్క ముమ్మాటి కే నిదే నుడువుచుంటి.

వలదు నాకింక నీసార్వభౌమపదవి
ఇదిగొ నారాజబిరుదంబు వదలుచుంటి,
తరుణులును గూడ నవిరళ త్యాగవహ్ని
నణుకుచుండఁగ నింకెట్టు లోర్చువాఁడ ?

దురతిశయమున కన్నులు పొరలుగ్రమ్మ
పఱచితిని మిమ్ము నగచాట్లపాలు గాఁగ,
మానవతు లైన మానినీమణుల కెదుర
నిలిచి సమరంబు నే నింక సలుపఁ జాల.

తల్లి ! భారతమహిళామతల్లు లిట్టి
దివ్యరణతంత్రకోవిదల్, దేశభక్తి
నిరత లంచును మున్నె నే నెఱిఁగియున్న
పొలువడుదునె యకట ! యీపాడుపనికి ?

తరతరంబులనుండి మీ తాతతండ్రు
లెల్లజనములు రంజిల్ల నేలుచున్న
పూజ్య మైనట్టి మేవాడురాజ్యలక్ష్మి
జోలి నా కేల? మీరలే యేలికొనుఁడు.

రిపుభయంకరమై దుర్నిరీక్ష్య మైన
నీదువదనంబు వీక్షింప నేర నింక
దేవి! భవదీయమూర్తి శాంతింపఁజేసి
సుప్రసన్నవై నను దయఁ జూడు మమ్మ.

సెల వొసంగుము, పోయి వచ్చెదను తల్లి!
నిరుపమం బగు నీశౌర్యనిధికి మెచ్చి
ఒక్క మేవాడె కాదు- వేఱొక్క రాజ్య
మొసఁగెదను నీకు, గైకొను పసదనంబు.

## శివాజీ శీలము

లగ్గవట్టి శివాజి కల్యాణికోట
ముట్టడించి పరాక్రమమున జయించి,
సఖులు మంత్రులు పరివారజనులు తన్ను
గూడి సేవింప నొకనాఁడు కొలువు దీర్చె.

అరుణకిరణుఁడు చరమాద్రి నొరఁగుచుండ,
చిమ్మచీఁకటిచీర కుచ్చిళ్లు దిద్ది
పైఁట సవరించుకొనుచుండ ప్రకృతికాంత,
మెల్లఁగా నవ్వుచుండ జాబిల్లికొదమ.

సద్దు మణఁగెను సభ యెల్ల, గద్దెనుండి
యింక దిగలేదు భూవరుఁ, డెల్లజనులు
దృష్టి సారించి యెద్దియో దృశ్యముదెస
చూచుచుండిరి తద్దయు చోద్య మొప్ప.

తేఁడు తోడనె యావైపు దృష్టి బఱపె,
మబ్బుమాటున చంద్రబింబంబు వోలె
మేలిముసుఁగున నెమ్మోము మెఱుఁగు లీన
తరుణి యొక్కతె నిలుచుండె శిరము వంచి.

“ జయము జయము మహారాజ! జయము జయము
దేవరకు పట్టమహిషియు, దేవి మాకు
కాఁదగిన విశ్వమోహనాకార నీమె
బందెగొని తెచ్చినారము ప్రభునికడకు.”

అనుచు సేనాని వచియించి యధికభక్తి
గదుర చేతులు చోడించి యొరగి నిలిచె,
ప్రభువు తల యెత్తి యాయింతివైపు జూచె,
జనుల కలకలారావముల్ సందడించె.

క్షణములో నొక్కపెట్టున జనులచూపు
లొక్కపరి ఱేనివైపున, నొక్కసారి
యింతివైపున త్రుళ్లింత లిడుచునుండె;
ఉస్సురని రాజు క్షణ మట్టె యూరకుండె.

"చారు సుకుమార సుందరాకార మైన
యీమెకడుపున నే నుదయించియున్న
అహహా! నే నెంత ధన్యుఁడ నగుదునో కద"
యనుచు గద్గదరవమున ననియె ఱేఁడు.

అధిపుఁ డాడిన యామాట లాలకించి
తెల్లవోయిరి సభలోని యెల్లవారు;
మేడచుట్టును నిలుచున్న మెలఁత లెల్ల
మేలు మే లని తలలూచి మెచ్చికొనిరి.

అదిగో! ఎవ్వరో శుభలక్షణాంగి యొకతె
రాజ్ఞి కాఁబోలు- సౌధాంతరముననుండి
ప్రణయదృష్టులతోఁ బాటు ప్రభునిమీఁద
కుసుమవర్షము కురిపించె కూర్మి మీఱ.

"విలువనగలును సన్నదువ్వలువ లొసఁగి
వెంటనే యామెఁ దోడ్కొని యింటి కేగి,
బల్మిమై నామె బందెగాఁ బట్టికొనిన
నేరమునకు క్షమాపణ కోరి రమ్ము."

అనుచు సేనాని కిరీటి నానతిచ్చి
డిగ్గు రని పీఠముననుండి డిగ్గ ఁడు,
సభ్యు లెల్లరు లేచిరి సంభ్రమమున,
సిగ్గుచే నంత సేనాని శిరము వాల్చె.

౯ ౯ ౯

కొండయొలు కంచు దొంగలగండఁ డంచు
ఛత్రపతిఁ గూర్చి పాశ్చాత్యచరితకారు
లెన్నికల్లలు రచియించియున్న నేమి,
వానిసత్కీర్తి యొక్కింత యేని చెడెనె?

## బ్రూసు – సాలీడు

స్వీయదేశము స్కాట్లండుస్వేచ్ఛ కొఱకు
తనదుజీవిత మెల్లను ధారవోసి
ఆంగ్ల సేనలఁ దలఁపడి ఆఱుమార్లు
పోరుగావించి జితుఁ డయ్యె బ్రూసురాజు.

తిరిగి రాజ్యము నెట్లో సాధించి తనదు
ప్రజల నెల్లర సంతోషపఱుప, నతఁడు
ఎన్ని యెన్నియో వ్యూహముల్ పన్నెఁ గాని
కార్యసాఫల్య మించుక గాంచఁ డయ్యె.

సొమ్మసిలి యాతఁ డూరూర దిమ్మదిరిగి
నిలిచి తలదాఁచికొన నింత నీడ లేక
కడకు నెట్టులో యొకపాడుగుడిసెఁ జేరి
వెచ్చనూర్చుచు దినములు బుచ్చుచుండె.

విసిగి వేసారి మొగ మట్టె వేలవైచి
నిస్పృహంబున నతఁడు చింతించుచుండ,
సాలెపురు గొండు పోఁగున వ్రేలియాడి
తటుకు మని వానిదృష్టిపథమునఁ బడియె.

దానిఁ బొడఁగనినంతనే ధరణివిభుఁడు
తనదు యోచన యొక్కింతతడవు మాని,
లూత యేమి యొనర్చునో చూత మనుచు
దానిచర్యలఁ గనుచుండె తమక మొప్ప.

గుడిసెనడికొప్పునం దున్న గూఁడునుండి
నూలువెంబడి సాలీఁడు వ్రేలుచుండె;
" చేరునా యది తనయిల్లు? చేరలేక
అల్లలాడున నావలె నిల్లు దొరఁగి? "

అనుచు నారాజు వింతగా నరయుచుండ,
సాలెపురు గట్టె పోఁగున వ్రేలియాడి
చీటిమాటికి పదముల జిమ్ముకొనుచు
కడఁకమై మీఁది కెగఁబ్రాఁకఁ గడఁగుచుండె.

అరిగెనో లేదొ నాలుగైదంగుళములు—
తోడనే యది క్రిందికి తూలి జాఱె;
మరల వెంటనె మీఁదికి నురికెఁ గాని,
తొంటికంటెను క్రిందికి తూలిపడియె.

తడవుకొనకుండ, త్రుటి యైన తడయకుండ
పైకి చరచర క్రమ్మఱ ప్రాఁకె చెలఁది;
ఔర! అది యేమి! పదములు జాఱె నేమొ—
నేలమీఁద గుబాలున కూలి పడియె.

తెప్పిఱిలి కొంతవడి కది తేఱి లేచి
తెంపుచే లేనిసత్తువ తెచ్చికొనుచు
గుప్పు మని పైకి కుప్పించి కొప్పరించె,
చేవ యెటనుండి వచ్చెనో చెలఁది కపుడు?

తాఁకినంతన తెగిపోవు దార మంట
మిగుల నెత్తైన నడికొప్పుమీఁది కంట
గాలిచే నూఁదుకొనిపోవు సాలెపురుగు
అక్కటా! ఎట్టు లెగఁబ్రాఁకు నంతదవ్వు?

మగుడ దిగజాఱి సాలీఁడు దిగువఁ బడియె
తోడనే యొక్క తూకున దుమికె పైకి;
పైకి క్రిందికి క్రిందికి పైకి, నిట్లు
బంతి మీఁటినగతి సారె గంతులిడియె.

ఏల కడఁగెద వింక నో సాలెపురుగ?
వమ్మై చనె నీప్రయత్నమ్ము లెల్ల
జాఱి కూలితి వింతలో నాలుమార్లు
కటకటా! చేరఁ గలవె నీ గమ్యసీమ?

మరల నొకసారి మీఁదికి నఱికె పురుగు
అడుగు మాత్రమె తనగూఁటి కవధియుండె;
జాఱెనా, యింక తనగూఁడు చేరలేదు;
జయము నొందున? తుదిసారి జాఱిపడున?

అల్లనల్లన క్రమముగా నడుగు లిడుచు
మీఁది కెగఁబ్రాఁకె సాలీఁడు మెల్లమెల్ల;
చంగు మని యొక్క గంతున చౌకళించి
ఎట్టకేలకు గూఁటియుయ్యాలను జేరె.

ధృతి దొలంగక నీవలె నేను గూడ
విజయలక్ష్మి వరించెద వేడ్క మీఱ"
అనుచు నెలుఁగెత్తి యఱిముఱి నఱచె తేఁడు.

కొంతకాలము గడచినయంత, నతఁడు
చెల్లచెదరైన సేనల నెల్లఁ జేర్చి
శత్రువులతోడ డీకొని జయము గాంచి
తనదు ప్రజలకు స్వాతంత్ర్యమును ఘటించె.

* * *

కార్య మేదైన సాధింపఁ గడఁగువారు
బ్రూసు సాలీనికత జ్ఞప్తి చేసికొనుచు
పెక్కుబన్నంబు లొదవిన లెక్కగొనక
కార్యసాఫల్య మగుదాఁకఁ గడఁగవలయు.



T-1458

# ప్రణయమహిమ

ఒకవిషాదదినంబున నువిద యొకతె
యేమొ యోచించుకొనుచుండె, నామెవదన
మొక్కపరి గాఢనిస్పృహ, మొక్కసారి
యించుకించుక యాశ సూచించుచుండె.

తాను మనసార వలచిన తరుణుఁ డొకఁడు
నాఁటిరాతిరి చెఱవెన్క తోఁటయందు
ప్రభునియానతి నురిదీయఁబడఁగ నుండె,
ఖంగు మని గంట మ్రోఁగిన క్షణమునందె.

పుడమి కెల్లను బంగారుపూఁత పూసి
అరుణబింబము చరమాబ్ధి నస్తమించె;
రమణి యంతట తనమందిరమును వీడి
రయమునం జని ప్రార్థనాలయముఁ జొచ్చె.

ఇంతి యచ్చట గంట వాయించువాని
తోడ ని ట్లనె పెదవులు తొట్రుపడఁగ,
"అన్న ! అల్లదె కారాగృహంబునందు
బందియై యుండె నాకూర్మిబందు వొకఁడు.

చల్లకై వచ్చి ముంత దాచంగ నేల ?
అతఁడే నాదు చిన్నారియనువుకాఁడు ;
నృపునిశాసనమునఁ జేసి నేఁటిరాత్రి
గంట మ్రోయంగనే వాని కంఠ మెగయు.

చెప్ప నేటికి ?— వాని రక్షించువాఁడు
ఈవు, దేవుఁడు తక్క నిం కెవఁడు లేఁడు,
ఈదినంబున గంట వాయింప మాని
ప్రేమతో నాకు పతిభిక్ష పెట్టు మయ్య."

"చిన్నతనముననుండి యోయన్నమిన్న !
ప్రభునియుప్పును తిని నేను బ్రదుకుచుంటి,
నేఁడు డెబ్బదియేఁడులవాఁడ నైతి
ఱేనియానతి యేగతి మానువాఁడ ?

చాలకాలమునుండియు స్వామియాజ్ఞ
నెఱపుచుంటిని, నేఁడును నెఱపువాఁడ,
ఏదియెటు లైన— గంట వాయింప మాన"
అనుచు వచియించె వృద్ధుఁడు వ్యగ్రుఁ డగుచు.

పిడుగు బోలిన యామాట వినినయంత
ఉల్లమున నామె యెంతయు తల్లడిల్లి
మొదలు నఱకిన కర్పూరకదళి వోలె
నేలపై నొక్కపెట్టున కూలఁబడియె.

తెప్పిఱిలి కొంతవడి కామె తేఱి లేచి
తటుకు మని యొక్కయోచన తట్ట మదికి,
గంట వ్రేలాడు గోపురాగ్రంబుకడకు
నిట్టనిలువున నెగఁబ్రాఁక నిశ్చయించె.

గంట లోపలి గుండునఁ గట్టియున్న
త్రాడు క్రిందికి వ్రేలాడ, దాని నామె
గట్టిగా రెండుచేతులఁ బట్టి, మీఁది
కెక్క నుంకించె, నయ్యారె! ఎట్టి తెంపొ ?

కాలుసేతుల రక్తంబు కాల్వగట్టి
జాలువాఱుచు నున్నను సరకుగొనక
మీఁది కెగఁబ్రాఁకుచుండె నమ్మెలఁత, యౌర!
వలపు గలచోట ప్రాణంబు చులుక గాదె?

అల్లిబిల్లిగ లో నెల్ల నల్లికొనిన
చెలఁదిగూఁడులు చీకాకు గొలుపుచున్న,
కటికిచీఁకటిగొందిలో కట్టకడకు
చేరుకొనె నామె యెట్టెటో శిఖరమునకు.

శిరముపై నున్న గంటను చేతఁ దడవి
ఉస్సురని యామె యొక్కనిట్టూర్పు పుచ్చె;
ముందు గనిన గుయ్యారంబు, క్రిందఁ గనిన
నంతకంటెను గుయ్యార మగుచుఁ దోఁచె.

అదిగో! అది యేమి? యాత్రాఁడు కదలుచుండె?
దరిసెఁ గాఁబోలు తన ప్రియుమరణవేళ;
ఏమి యొనరింపవలయునో యామె మఱచె,
చిత్తరువు రీతి నూఁగాడె చేష్టలుడిగి.

శ్వాస మరికట్టి, గుండియ జల్లురనియె,
ముమ్మరమ్ముగ చెమ్మటల్ గ్రమ్మె మేన;
అంతరాళమునం దామె యెంతసేపు
వ్రేలియాడుచు నారీతి తాళఁగలదు?

కొట్ట నిచ్చున గంటను? పట్టుకొనున?
అదియు నిది గాక, సత్తువ ప్రిదులువడఁగ
పట్టు విడి నేలఁ గూలున పడఁతి? యకట!
ఏది జరుగంగ నుండెనో యెవరి కెఱుక?

వెంటనే యామె కన్నుల వింతకాంతి
తళుకు లీన, తటాలున తాల్మి నూని
పైకి గుప్పించి గంటను పట్టుకొనియె,
త్రాణ యెటనుండి వచ్చెనో తరుణి కపుడు!

మొగము బిగియించి కనుబొమల్ ముడివడంగ
నువిద యిట్లనె హుమ్మని హుంకరించి,
"ఏది యెటులైనఁ గానిమ్ము— నాదు ప్రతిన
యిదియె, యీరేయి గంట వాయింపనియదు."

తెంపుతో నిట్లు ఘోరప్రతిజ్ఞ చేసి
ఒక్కచేతను త్రాడు, వేఱొక్కచేత
బలిమిమై గంట గట్టిగాఁ బట్టుకొనుచు
వ్రేల నుంకించె తొయ్యలి రేయి యెల్ల.

త్రాణతో రెండు చేతుల త్రాడు బట్టి
లాగుచుండెను గంట నాఁడాగకుండ,
గంట మ్రోగుచునున్నది గాఁ దలంచె
పాప మాతఁడు వినలేఁడు బధిరుఁ డగుట.

తనకరంబులు వడవడ వణఁకుచున్న
పడఁతి తనచేతిపట్టు తా విడువదయ్యె,
హృదయ మదవదమై కడు బెదరుచున్న
నదరుపెదవుల నిట్లామె వదరుచుండె.

"ఉసురు లీబొందిలో నిల్చియున్నదాఁక
పెనఁగి నెట్టన నాపట్టు విడువఁజాల,
వేఁగుజా మైన నగుఁ గాక, వ్రేలుదాన
ఏది యెటు లైన— గంట వాయింపనీయ."

బళ్ళు మని యంత నల్లదే తెల్లవాఱె,
ఓహో ! ఏమి యాజనుల కోలాహలంబు ?
ఆతఁ డెవ్వఁడు ? ముందుగా హయము నెక్కి
వడి హుటాహుటినడలతో వచ్చుచుండె.

గంటపై నాని యుంచిన కరము దిగిచి
వగ్గమున రెండుచేతులు బిగ్గఁ గూర్చి
గుప్పు మని జాఱి నేలపై కుఱికె కలికి
మింటిపైనుండి తెగివడ్డ మినుకు వోలె.

కాఱుమబ్బులనుండి క్రొక్కాఱు మెఱుఁగు
కరణి, చిమ్మచీఁకటినుండి తరుణి వెడలి
పరుగుపరుగున సరగున నరుగుదెంచి
ఱేనిపదములపైఁ దనమేను జేర్చె.

జాఱుచున్నట్టి కన్నీటిజాలుచేత
దొరఁగి స్రవియించు చెమటబిందువులచేత
ఏఱులై పాఱు నెత్తురుధారచేత
కడిగె తొయ్యలి ప్రభుపాదకమలయుగళి.

తోడనే లేచి చేదోయి దోయిలించి
చినుఁగువలువలు, నొగిలినతనువు జూపి
జాలి గులుకఁగ గద్గదస్వరముతోడ
వెలఁది ప్రభునకు సర్వంబు విన్నవించె.

రమ్య మయ్యును క్లేశభారమ్ముచేత
వన్నె దిగఁద్రావి వసివాళ్లు వాఱియున్న
తరుణిముఖబింబ మవలీల కఱఁగఁజేసె
వజ్రసన్నిభ మైన యాప్రభునిమనము.

"పడఁతి! ఎంతటి కష్టముల్ పడితి వమ్మ?
పావనం బగు తావకప్రణయమహిమ
ప్రియునిఁ గాపాడె, నీ వింక భయము మాని
ప్రేమలహరిని దేలుమా ప్రియునిఁ గూడి."

అనుచు నీరీతి భూవరుఁ డానతిచ్చి
అధికదయతోడ నాయింతి నాదరించి
భటుని నొక్కని వేగమె పంపి యామె
ప్రియుని చెఱనుండి విడిపించి ప్రియము నించె.

రేయి యెల్లను తమ్మిపూరేకు లనెడి
చెఱలలోఁ జిక్కి కరము కృశించియున్న
యళులబంధము లెడలించి యార్తి దీర్చి
మిహిరబింబము పూర్వాద్రిమీఁదఁ బొడిచె.